సాక్షి
అనకాపల్లి
మంగళవారం । 1 । ఆగస్టు । 2023



సంతృప్తి స్థాయికి...

స్పందన అర్జీల పరిష్కారంపై ప్రజలలో మరింత సంతృప్తి పెరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. 8లో



శ్రీవారికి వెండి కుందులు

విశాఖ: రుషికొండలోని వెంకన్న ఆలయానికి సీఎంఆర్ అధినేత మావూరి రూ.7 లక్షల విలువైన వెండి కుందులను బహూకరించారు.



మణిపూర్ మంటలపై నిరసన

విశాఖ: మణిపూర్‌లో హింసాకాండకు నిరసనగా విశాఖ మ్యూచువల్ ఎయిడెడ్ కో ఆపరేటివ్ సొసైటీ భారీ ర్యాలీ నిర్వహించింది.

న్యూస్‌రీల్

బాలల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా మిషన్ ఇంద్రధనుష్



కలెక్టర్ రవి పట్టాన్ శెట్టి

తుమ్మపాల: జిల్లాలో మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. వైద్యం, విద్య, మహిళ స్త్రీ శిశు సంక్షేమం, మున్సిపల్ శాఖ అధికారులతో కలెక్టర్ వెబ్‌ఎక్స్‌లో మిషన్ ఇంద్రధనుష్‌పై సోమవారం సమీక్ష నిర్వహించారు. బాలల సంపూర్ణ ఆరోగ్యమే మిషన్ ఇంద్రధనుష్ లక్ష్యమని, ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలోని ప్రతి ప్రాంతంలో సర్వే చేపట్టి 0–5 సంవత్సరాల వయసు పిల్లలను గుర్తించి వారికి టీకాలు వేయాలన్నారు. ముఖ్యంగా పట్టణాలలోని స్లమ్ ఏరియాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. మిషన్ ఇంద్రధనుష్ ఆగస్టు 7 నుంచి 12 వరకు, సెప్టెంబర్ 11 నుంచి 16 వరకు, అక్టోబర్ 9 నుంచి 14 వరకు మూడు దశల్లో జరుగుతుందన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది, ఎంఈవోలు, మున్సిపల్ అధికారుల సహకారంతో సచివాలయాలు, గ్రామీణ, పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో టీకాల కార్యక్రమం చేపట్టనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎ.హేమంత్ చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఈవో వెంకట లక్ష్మమ్మ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ అనంతలక్ష్మి, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ శ్రావణ్‌కుమార్, డబ్ల్యూహెచ్‌వో యూనిసెఫ్ ప్రతినిధులు హర్షిత్ కమలాకర్, అధికారులు పాల్గొన్నారు.

డాక్‌యార్డ్ అడ్మిరల్ సూపరింటెండెంట్‌గా విజయ్



సంజయ్ నుంచి బాధ్యతలు స్వీకరిస్తున్న విజయ్ శేఖర్

సాక్షి, విశాఖపట్నం: నేవల్ డాక్‌యార్డు అడ్మిరల్ సూపరింటెండెంట్‌గా రియర్ అడ్మిరల్ విజయ్ శేఖర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్న రియర్ అడ్మిరల్ సంజయ్ సాధు వెస్టర్న్ నేవల్ కమాండ్ చీఫ్ స్టాఫ్ ఆఫీసర్(టెక్నికల్)గా బదిలీ అయ్యారు. సంజయ్ నుంచి విజయ్ బాధ్యతలు చేపట్టారు. విజయ్‌శేఖర్ 1988లో భారత నౌకాదళంలో చేరి 34 ఏళ్ల కెరీర్‌లో అనేక కీలకమైన బాధ్యతలు నిర్వర్తించారు. ఇండియన్ సబ్‌మెరైన్స్ ఐఎన్‌ఎస్ వాగ్లీ, శంకుల్, షాల్కీతో పాటు ఐఎన్‌ఎస్ జ్యోతి వార్ షిప్‌కి ప్రాతినిధ్యం వహించారు. రక్షణ మంత్రిత్వ శాఖ ఇంటిగ్రేటెడ్‌హెడ్‌క్వార్టర్స్‌లో మెటీరియల్ అసిస్టెంట్ చీఫ్‌గా విధులు నిర్వర్తించారు. నేవల్ డాక్‌యార్డు విశాఖపట్నం, ముంబైలో పలు బాధ్యతలు చేపట్టారు.

వైస్ అడ్మిరల్ బిస్వజిత్ 'పుల్లింగ్ అవుట్'

ఈఎన్‌సీ చీఫ్‌కు ఘనంగా వీడ్కోలు



పుల్లింగ్ అవుట్ చేస్తున్న వైస్ అడ్మిరల్ బిస్వజిత్ దాస్ గుప్తా

సాక్షి, విశాఖపట్నం: తూర్పు నౌకాదళాధిపతి వైస్ అడ్మిరల్ బిస్వజిత్ దాస్ గుప్తా పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఈస్టర్న్ నేవల్ కమాండ్ బిస్వజిత్‌కు సోమవారం ఘనంగా వీడ్కోలు పలికింది. ఐఎన్‌ఎస్ సర్కార్‌లో నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో వైస్ అడ్మిరల్ బిస్వజిత్ సెరిమోనియల్ గార్డ్‌ని తనిఖీ చేసిన అనంతరం ఫ్లాగ్ ఆఫీసర్స్, నేవల్‌షిప్స్, సబ్ మెరైన్లు, వివిధ విభాగాధికారుల కమాండింగ్ అధికారులు నిర్వహించిన ప్లటూన్‌లను సమీక్షించారు. సంప్రదాయ బద్ధంగా నిర్వహించే పుల్లింగ్ అవుట్ సెరమనీలో బిస్వజిత్ పాల్గొన్నారు. 38 సంవత్సరాల పాటు నౌకాదళానికి విశిష్ట సేవలందించిన ఆయనకు ఘన వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ కేంద్రంగా తూర్పు నౌకాదళంలో తన చివరి విధులు నిర్వర్తించడం గర్వంగా ఉందన్నారు.

హిందీ హయ్యర్ పరీక్షల ఫీజు చెల్లింపునకు గడువు పెంపు

తగరపువలస: దక్షిణ భారత హిందీ ప్రచారసభ (చెన్నై) సెప్టెంబరులో నిర్వహించే హయ్యర్ పరీక్షల ఫీజు చెల్లింపునకు ఈ నెల 5 వరకు గడువు పెంచారు. ఆంధ్ర, తెలంగాణలో వర్షాల కారణంగా రూ.10 అపరాధ రుసుముతో ఈ గడువు పెంచినట్టు నిర్వాహకులు ప్రకటించారు. మిగిలిన వివరాలకు 89858 97419లో సంప్రదించాలని ఆదర్శ హిందీ ప్రేమీ మండలి భీమిలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్ కృష్ణారావు కోరారు.

విశాఖ.. భాగ్యరేఖ

- నేడు విశాఖకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాక
- సీఎం చేతుల మీదుగా ఇనార్బిట్ మాల్‌కు శంకుస్థాపన
- రూ.864 కోట్ల పనులకు శ్రీకారం



ఏయూలోని ఫార్మా ఇంక్యుబేషన హబ్ భవనం

సాక్షి, విశాఖపట్నం: విశ్వనగరి విశాఖకు అంతర్జాతీయ బ్రాండింగ్ కల్పించేందుకు ప్రభుత్వం శరవేగంగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే వేల కోట్లతో ప్రాజెక్టులు, అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం రూ.864.88 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. రహేజా గ్రూప్ సాలిగ్రామపురంలో నిర్మించనున్న ఇనార్బిట్ మాల్‌కు ముఖ్యమంత్రి భూమిపూజ చేస్తారు. ఫేజ్–1లో ఇనార్బిట్ మాల్ నిర్మాణానికి రహేజా గ్రూప్ రూ.600 కోట్ల వ్యయం చేస్తోంది. 6 లక్షల చదరపు అడుగుల్లో మాల్, 4 లక్షల చదరపు అడుగుల పార్కింగ్ ప్రాంతం నిర్మించనుంది. 2026 కల్లా దీన్ని పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. 250 జాతీయ, అంతర్జాతీయ బ్రాండ్ స్టోర్స్, మల్టీప్లెక్స్‌లు, ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్ సెంటర్, ఫుడ్‌కోర్టు, టెర్రస్ గార్డెన్, షాపింగ్ స్పేస్ రానున్నాయి. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 5 వేల మందికి ఉపాధి కలగనుంది. అన్నింటినీ గ్రీన్ బిల్డింగ్ ప్రమాణాలకు అనుగుణంగా నిర్మించనున్నారు.

రూ.135.88 కోట్లతో జీవీఎంసీ ప్రాజెక్టులకు శంకుస్థాపన

ఇనార్బిట్ మాల్ శంకుస్థాపన అనంతరం.. అదే ప్రాంగణంలో నగర ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, వివిధ ప్రాంతాల అభివృద్ధి, విశాఖ సుందరీకరణ ప్రాజెక్టులకు సీఎం వైఎస్ జగన్ శంకుస్థాపన చేయనున్నారు. అమృత్ 2.0, స్మార్ట్‌సిటీ, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.135.88 కోట్లతో చేపట్టనున్న 50 పనుల్ని ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను కూడా జీవీఎంసీ అధికారులు పూర్తి చేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో రూ.129 కోట్లతో చేపట్టిన ఐదు కీలక ప్రాజెక్టులను ప్రారంభిస్తారు.

శ్రీకారం చుట్టనున్న జీవీఎంసీ ప్రాజెక్టుల్లో కొన్ని..

- రూ.3 కోట్లతో 66వ వార్డులో గాజువాక జంక్షన్ నుంచి వంటిల్లు జంక్షన్ వరకూ రహదారి విస్తరణ
- రూ.2.40 కోట్లతో జోన్–3 పరిధిలో జాతీయ రహదారి జంక్షన్ నుంచి పెదవాల్తేరు జంక్షన్ వరకూ ఎండ్ టూ ఎండ్ రోడ్ విస్తరణ
- రూ.2 కోట్లతో జోన్–2లో పీఎంపాలెంలోని సాంకేతిక వైద్యవిధాన పరిషత్‌కు వెళ్లే మార్గం ఎండ్ టూ ఎండ్ రహదారి విస్తరణ
- ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు రూ.1.33 కోట్లతో ఆర్ అండ్ బీ జంక్షన్, కాకానినగర్ జంక్షన్ అభివృద్ధి
- అమృత్ 2.0లో భాగంగా రూ.7.90 కోట్లతో భీమిలిలోని కొండపేట పంప్‌హౌస్ అభివృద్ధి
- క్రాంతినగర్, మింది, తుంగ్లాం, చినగంట్యాడ, జగ్గరాజుపేట, నరవ, కొమ్మాది, లంకెలపాలెం, నాతయ్యపాలెం, చిల్లపేట చెరువుల్లో రూ.30 కోట్లతో రెజువనేషన్ పనుల నిర్వహణ
- రూ.3 కోట్లతో సాగర్‌నగర్ వద్ద, రూ.3.24 కోట్లతో డిఫెన్స్ క్వార్టర్స్ వద్ద యురోపియన్ స్టైల్‌లో ఈట్ స్ట్రీట్స్ నిర్మాణం
- రూ.6 కోట్లతో వాల్తేరు మెయిన్ రోడ్డు నుంచి వీఎంఆర్‌డీఏ పార్క్ జంక్షన్ వరకూ స్మార్ట్ రోడ్డు నిర్మాణ పనులు



ఇనార్బిట్ మాల్ సభా వేదిక



బందోబస్తు కోసం తరలివచ్చిన పోలీసులు

ఏర్పాట్లు పరిశీలించిన మంత్రులు



ఏయూలో ముఖ్యమంత్రి ప్రారంభించే భవనాన్ని పరిశీలిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్



వేదిక వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న మంత్రి సురేష్

తాటిచెట్లపాలెం (విశాఖ): కైలాసపురంలో రహేజా గ్రూప్ నిర్మాణం చేపట్టనున్న ఇనార్బిట్‌మాల్ శంకుస్థాపన ఏర్పాట్లు పూర్తయ్యాయని మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ తెలిపారు. సోమవారం జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మతో కలిసి ఆయన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మాల్ ప్రారంభమైతే వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. రూ.139 కోట్ల వ్యయంతో నగర సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేస్తారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో విశాఖ నగరం ప్రపంచ స్థాయి గుర్తింపు సంతరించుకోనుందన్నారు. ముందుగా జీవీఎంసీ మేయర్ గొలగాని హరివెంకటకుమారి కూడా జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మతో కలిసి ఏర్పాట్లు పరిశీలించారు. తరువాత పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, జిల్లా కలెక్టర్ మల్లికార్జున, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్‌చైర్మన్ కేకే రాజు కూడా శంకుస్థాపన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ పర్యటనలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, జీవీఎంసీ ఫ్లోర్‌లీడర్ బాణాల శ్రీనివాస్, డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు, జీవీఎంసీ అదనపు కమిషనర్లు డాక్టర్ వై.శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రధాన ఇంజనీరు రవి కృష్ణంరాజు, పట్టణ ప్రణాళిక అధికారి సునీత, ప్రజా ఆరోగ్య అధికారి నరేష్ కుమార్, యూసీడీ పీడీ పాపునాయుడు, జోనల్ కమిషనర్లు, ఇనార్బిట్ మాల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేటి నుంచి మరో 100 క్యూసెక్కుల 'రైవాడ' నీరు విడుదల



సమావేశంలో పాల్గొన్న తాతయ్యబాబు, అనురాధ, జగన్‌మోహన్ తదితరులు

కె.కోటపాడు: రైవాడ జలాశయం ఎడమ కాలువ ద్వారా 100 క్యూసెక్కుల నీటిని రైతుల ప్రస్తుత పంటల సాగు అవసరాల నిమిత్తం మంగళవారం నుంచి విడుదల చేస్తున్నట్లు రైవాడ ప్రాజెక్ట్ మాజీ చైర్మన్ బొడ్డు తాతయ్యబాబు తెలిపారు. కె.కోటపాడులో సోమవారం ఆయకట్టు గ్రామాల పరిధిలో గల రైతులతో కలిసి ఆయన విలేకరుల సమావేశాన్ని జరిపారు. రైవాడ రిజర్వాయర్ నుంచి నీటి విడుదలపై డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడితో చర్చించిన తరువాత ఆయన ఆదేశాల మేరకు నీరు విడుదల చేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు, జెడ్పీటీసీ సభ్యురాలు ఈర్లె అనురాధ మాట్లాడుతూ ఇప్పటికే రైవాడ కుడి కాలువ ద్వారా ప్రతి రోజూ 50 క్యూసెక్కుల నీరు విడుదల అవుతుందన్నారు. దీంతోపాటు ప్రస్తుత ఖరీఫ్ సాగు కాలం ప్రారంభం అయిన నేపథ్యంలో ప్రాజెక్ట్ ఎడమ కాలువ ద్వారా 100 క్యూసెక్కుల నీటిని విడుదల చేయనున్నామని, దీంతో రైతులు దమ్ములు చేసేందుకు అవకాశం కలగనున్నట్లు ఆమె తెలిపారు. రిజర్వాయర్ నుంచి విడుదల చేస్తున్న నీటిని అవసరాలను బట్టి వినియోగించుకోవాలని ఆమె కోరారు. రైవాడ నీరు రైతులకే అన్న నినాదం మేరకు ప్రతి ఏడాది ఖరీఫ్, రబీ పంటల సాగు కాలాల్లో నీటిని విడుదల చేయించే చర్యలను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తీసుకుంటున్నారని ఆమె తెలిపారు. సమావేశంలో కె.కోటపాడు ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, దేవరాపల్లి మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రెడ్డి జగన్‌మోహన్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు, రొంగలినాయుడుపాలెం సర్పంచ్ పైల పైడితల్లమ్మ, ఎ.కోడూరు, చౌడువాడ ఎంపీటీసీలు ఏటుకూరి రాజేష్, లెక్కల శంకరరావు పాల్గొన్నారు.

మారేపల్లి దేవాలయ భూముల క్రయ, విక్రయాలు చెల్లవు

దేవరాపల్లి: మారేపల్లిలో దేవ దాయ, ధర్మాదాయ శాఖకు చెందిన భూముల అమ్మకం, కొనుగోలు చెల్లవని మారేపల్లి శ్రీరామాలయం ఏక సభ్య ధర్మకర్త ఎం.శ్రీధర్ పేర్కొన్నారు. ఈ మేరకు అనకాపల్లి దేవదాయ శాఖ కార్యాలయం నుంచి సోమవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. మారేపల్లిలో శ్రీరామాలయానికి చెందిన 46.54 ఎకరాల భూములు ఉన్నాయని, ఈ భూముల క్రయ, విక్రయాలు జరపడం చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. ఈ భూముల అమ్మకం, కొనుగోలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మారేపల్లిలో శ్రీరామాలయం పేరిట సర్వే నెంబర్ 115లో 23.15 ఎకరాలు, సర్వే నెంబర్ 120లో 10.85 ఎకరాలు, 180/4లో 6.25 ఎకరాలు, 17/7లో 2.36 ఎకరాలు, 21/22లో 0.03 సెంట్లు, 21/5లో 0.35 సెంట్లు, 22/7లో 0.04 సెంట్లు, సర్వే నెంబర్ 22/18లో 0.35 సెంట్లు భూములు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. దేవదాయ శాఖ చెందిన ఈ భూములు కొనుగోలు చేసిన వారికి ఎటువంటి హక్కులు ఉండవని, తీవ్రంగా నష్టపోతారని, ఈ విషయం గుర్తించుకోవాలని ఆయన సూచించారు. మారేపల్లి రామాలయం భూముల అమ్మకాలు, కొనుగోలుతో అన్యాక్రాంతం అవుతున్నాయని ఆరోపణలు రావడంతోపాటు వీటిపై కొందరు ఫిర్యాదు చేయడంతో దేవదాయశాఖ అధికార్లు ఈ ప్రకటనను విడుదల చేశారు.

నేటి నుంచి ఫార్మేటివ్ – 1 పరీక్షలు

- ఎస్‌సీఈఆర్టీ ప్రశ్నాపత్రాలతోనే పరీక్షలు
- ప్రైవేటు స్కూళ్లలోనూ అమలు చేయాల్సిందే
- ప్రభుత్వ స్కూళ్లలో తొలిసారిగా టోఫెల్ పరీక్ష
- ఏర్పాట్లు పూర్తి చేసిన విద్యాశాఖాధికారులు



విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేస్తున్న ఉపాధ్యాయిని

విశాఖ విద్య: ఉమ్మడి విశాఖ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో మంగళవారం నుంచి ఫార్మేటివ్ – 1 / క్లాస్ రూమ్ బేస్డ్ అసెస్మెంట్ పరీక్షలు ప్రారంభమవుతున్నాయి. ఈ నెల 4 వరకు పరీక్షలు జరగనున్నాయి. వీటి నిర్వహణకు విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల విద్యాశాఖాధికారులు అంతా సిద్ధం చేశారు. 2023 – 24 విద్యా సంవత్సరానికి ఇవే తొలి పరీక్షలు కావడం, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రయోగాత్మకంగా టోఫెల్ పరీక్ష నిర్వహిస్తుండడంతో విద్యాశాఖాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. గతంలో ప్రైవేటు పాఠశాలల్లో సొంతంగా తయారు చేసుకున్న ప్రశ్నాపత్రాలతో పరీక్షలు నిర్వహించుకునేవారు. కానీ ప్రస్తుతం రాష్ట్ర విద్య పరిశోధన శిక్షణ సంస్థ (ఎస్‌సీఈఆర్‌టీ) రూపొందించిన పాఠ్య పుస్తకాలతోనే ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో బోధన సాగుతున్నందున, ఒకే విధానంలో పరీక్షలు నిర్వహించాలని విద్యాశాఖాధికారులు ఆదేశించారు. ప్రశ్నాపత్రాలను కూడా ఎస్‌సీఈఆర్‌టీ ద్వారానే సరఫరా చేస్తున్నారు. క్లాస్ రూమ్ బేస్డ్ అసెస్మెంట్ నిర్వహణ కోసం ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల విద్యార్థులందరికీ ఎస్‌సీఈఆర్‌టీ తయారు చేసిన ప్రశ్నాపత్రాలతో పాటు, ఓఎమ్మార్ షీటు కూడా ఇస్తారు. జవాబులను ప్రశ్నాపత్రంలో టిక్ చేయటంతో పాటు రాయాలి. అదేవిధంగా ఓఎమ్మార్ షీట్‌లో బబుల్ చేయాలి. పరీక్షలకు అవసరమైన సామాగ్రిని జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు ద్వారా పాఠశాలలకు సరఫరా చేశారు.

తొలిసారిగా టోఫెల్ పరీక్ష

ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం బోధన సాగుతున్న నేపథ్యంలో విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేసేందుకు తొలిసారిగా 'టోఫెల్' పరీక్ష నిర్వహిస్తున్నారు. 'ఇంగ్లిష్ పేపర్ పార్ట్ – బీ'లో టోఫెల్‌కు సంబంధించిన అంశాలు ఉంటాయి. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్, స్మార్ట్ టీవీలు అందుబాటులో ఉన్న పాఠశాలల్లో టోఫెల్ పరీక్షను తప్పనిసరిగా నిర్వహించాలని, మిగతా చోట్ల ఉపాధ్యాయుల ఆసక్తి మేరకు నిర్వహించొచ్చని విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పష్టం చేశారు.

పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



ఫార్మేటివ్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశాం. ప్రశ్నాపత్రాలను పాఠశాలలకు సరఫరా చేశాం. టోఫెల్ పరీక్షను తొలిసారిగా నిర్వహిస్తున్నందున ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ఏవైనా అనుమానాలు ఉన్నట్లయితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలి. జవాబు పత్రాల మూల్యాంకనం సకాలంలో పూర్తి చేసి, ఉన్నతాధికారులకు నివేదించాలి.

– ఎం.వి.కృష్ణ కుమార్, డీసీఈబీ సెక్రటరీ, ఉమ్మడి విశాఖ జిల్లా

క్లుప్తంగా

విద్యార్థి అదృశ్యం


ధరిమిశెట్టి ఆకాష్

అనకాపల్లి టౌన్‌: మండలంలోని తుమ్మపాల పంచాయతీ కొత్తపేట వీధికి చెందిన విద్యార్థి ధరిమిశెట్టి ఆకాష్‌(14) అదృశ్యమైనట్లు పట్టణ పోలీసులకు సోమవారం ఫిర్యాదు అందింది. ఎస్‌ఐ దివాకర్‌యాదవ్‌ కథనం మేరకు వివరాలు.. ఆకాష్‌ సోమవారం తెల్లవారు జామున ఇంటిలో ఉన్న సైకిల్‌ వేసుకుని బయటకు వెళ్లాడు. ఎంతకీ తిరిగి రాకపోవడంతో చుట్టుప్రక్కల వెతికించారు. జాడ తెలియకపోవడంతో ఆకాష్‌ తండ్రి గణేష్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

బైక్‌ ప్రమాదంలో యువకుడి మృతి


చికిత్స పొందుతూ మృతిచెందిన రాజీవ్‌ రత్నం

కె.కోటపాడు: మండలంలో సూర్రెడ్డిపాలెం కూడలి సమీపంలో ఆదివారం సాయంత్రం బైక్‌ అదుపుతప్పి ప్రమాదానికి గురయ్యింది. కె.కోటపాడు నుంచి బైక్‌పై వస్తున్న ఎ.కోడూరు గ్రామానికి చెందిన యువకుడు మూనూరు రాజీవ్‌ రత్నం (18) తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అతడిని కె.కోటపాడు ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స అనంతరం, మెరుగైన వైద్యం కోసం విశాఖలోని కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మరణించాడు. మృతుని తల్లి బంగారమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎ.కోడూరు ఎస్‌ఐ బి.రామకృష్ణ కేసు నమోదు చేశారు. యువకుడి మృతదేహానికి పోస్టుమార్టం చేసి, బంధువులకు అప్పగించారు.

ఆన్‌లైన్‌ రమ్మీ ఆడుతున్న నలుగురి అరెస్ట్‌

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని పూడిమడక వద్ద ఆన్‌లైన్‌లో రమ్మీ ఆడుతున్న నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 23 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సంతృప్తి స్థాయికి 'జగనన్నకు చెబుదాం'

- అధికారులకు కలెక్టర్‌ రవి పట్టాన్‌శెట్టి ఆదేశం
- 'స్పందన'కు 303 అర్జీలు


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్‌ రవి పట్టాన్‌శెట్టి, జేసీ జాహ్నవి, డీఆర్వో వెంకటరమణ

తుమ్మపాల: జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమంలో వచ్చే అర్జీలు, ఫిర్యాదుల పరిష్కారంపై ప్రజలలో మరింత సంతృప్తి పెరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ రవి పట్టాన్‌శెట్టి సూచించారు. కలెక్టర్‌ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఆయనతో పాటు జేసీ ఎం.జాహ్నవి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ ఫిర్యాదులు, అర్జీల రూపంలో వచ్చే ప్రతి సమస్య పరిష్కారానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమస్య పరిష్కారంపై అర్జీదారుడికి భరోసానివ్వాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం, జగనన్నకు చెబుదాం, అసెంబ్లీ నియోజకవర్గాల అభివృద్ధి సమీక్షలలో వచ్చిన సమస్యలపై కూడా సత్వర పరిష్కారానికి చొరవచూపాలన్నారు.

జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో సోమవారం మొత్తం 303 దరఖాస్తులు నమోదైనట్లు డీఆర్వో పి.వెంకటరమణ తెలిపారు. పలు సమస్యలపై ప్రజాసంఘాలు, అగ్రిగోల్డ్‌ బాధితులు, మధ్యాహ్న భోజన పథకం వేతనదారులు, చిట్‌ బాధితులు కలెక్టర్‌ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా రూరల్‌ ఎస్‌ఐ నరసింహారావు ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట ఏర్పాట్లు చేశారు. అసిస్టెంట్‌ కలెక్టర్‌ స్మరణ్‌రాజ్‌, డ్వామా పీడీ సందీప్‌, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రధాన అర్జీలు

- తమ సాగులో ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్వహిస్తున్న వీవీఆర్‌ క్రషర్‌ అనుమతులను తక్షణమే రద్దు చేయాలని అనకాపల్లి మండలం వెంకుపాలెం గ్రామస్తుడు లెక్కల నాయుడు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సర్వే నెం.303/1 ప్రభుత్వ భూమిలో అక్రమ క్రషర్‌ నిర్వహణపై అనేక ఫిర్యాదులున్నా రెవెన్యూ, మైన్స్‌ అధికారులు స్పందించడం లేదని తెలిపారు.
- అగ్రిగోల్డ్‌ బాధితుల డిపాజిట్లపై ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు న్యాయం చేయాలని అగ్రిగోల్డ్‌ కస్టమర్స్‌, ఏజెంట్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ గేటు వద్ద అగ్రిగోల్డ్‌ బాధితులు అర్ధనగ్న ప్రదర్శన చేశారు. ఒకటి కంటే ఎక్కువ డిపాజిట్లు చేసిన 3.5 లక్షల మందికి ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో నాయకులు భద్రం, కరణం మాణిక్యాలరావు, ఎం.గోపాలరమణ, బీవీ రమణ పాల్గొన్నారు.
- పుట్టుకతో మూగరాలైన సుంకర రత్నంకు వికలాంగ పింఛను మంజూరు చేయాలని కోరుతూ అనకాపల్లి మండలం రేబాక గ్రామానికి చెందిన పాము లక్ష్మి, తన సోదరితో వచ్చి కలెక్టర్‌కు విన్నవించుకుంది. ఆమెకు 1998లో 70 శాతం వికలాంగత్వంతో మంజూరు చేసిన వికలాంగ ధ్రువపత్రం పనిచేయదని సచివాలయంలో చెప్పారని, ప్రత్యామ్నాయం లేకపోవడంతో జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అర్జీ ఇచ్చినట్లు తెలిపారు.
- సమాచార హక్కు చట్టం దరఖాస్తులపై నిర్ణీత గడువులోగా సరైన సమాధానం ఇవ్వకుండా అర్జీదారులను తప్పుదోవ పట్టిస్తూ, కార్యాలయం చుట్టూ తిప్పించుకుంటున్నారని అనకాపల్లి తహసీల్దార్‌ కార్యాలయ సిబ్బందిపై కేఎస్‌ఆర్‌ పేటకు చెందిన కశిరెడ్డి అప్పలకొండ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశబూరు. కొన్ని దరఖాస్తులపై వాస్తవాలకు విరుద్ధంగా తప్పుడు సమాచారం అందిస్తున్నారని వివరించారు.
- జీవీఎంసీ కొత్తూరు–రాజుపాలెం రైల్వే వంతెన నిర్మాణానికి భూసేకరణపై అభ్యంతరాలు తెలుపుతూ భవన యాజమానులు, రైతులు వినతి పత్రం అందించారు. తమకు తెలియకుండా భూసేకరణ చేపట్టి, ఇపుడు గ్రామసభ ద్వారా నష్టపోతున్న రైతుల పేర్లు విడుదల చేయడం అన్యాయమంటూ కొత్తూరు గ్రామస్తులు గైపూరి భాస్కరరావు విన్నవించారు. తాము కోల్పోతున్న భవనాలు, భూముల విలువలకు తగ్గట్టుగా మరో చోట ప్రత్యామ్నయంగా సౌకర్యాలు కల్పించాలన్నారు. రైల్వే శాఖలో తమ పిల్లలకు ఉద్యోగాలు కేటాయించాలన్నారు. రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు వీలుగా వంతెనకు ఇరువైపులా సర్వీసు రోడ్డు నిర్మించాలని పేర్కొన్నారు.


తన సమస్యపై అర్జీ ఇచ్చేందుకు కుమారుడి సాయంతో వస్తున్న వృద్ధురాలు

స్పందన ఫిర్యాదులపై నివేదిక ఇవ్వండి

జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ

అనకాపల్లి టౌన్‌: స్పందన అర్జీలపై నిర్ణీత సమయంలో నివేదిక అందించాలని పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదేశించారు. తన కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందనలో 43 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలపై ఆరా తీశారు. అక్కడికక్కడే సమస్య పరిష్కారానికి చొరవ తీసుకున్నారు. కొంతమంది అర్జీదారులు ఎస్పీ మురళీకృష్ణకు స్వేచ్ఛగా తమ సమస్యలను విన్నవించుకున్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తానని అర్జీదారులకు భరోసా కల్పించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ(పరిపాలన) బి.విజయభాస్కర్‌, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్‌ చంద్రశేఖర్‌ తదితరులు పాల్గొన్నారు.

దోషుల్ని శిక్షించాలి


నూకరాజు

నా పేరు కణితి నూకరాజు. నాది శంకరం గ్రామం. కూలి పని చేసుకుంటూ గ్రామంలోని రాజీవ్‌గృహకల్పలో భార్య శ్రీదేవితో జీవిస్తున్నాను. ఈ నెల 29న కొంతమంది దుండగలు నా తలపై బలంగా కొట్టారు. అదే రోజు గ్రామీణ పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ న్యాయం జరగలేదు. దీంతో స్పందనలో ఎస్పీకి అర్జీ చేసుకున్నా. దోషుల్ని గుర్తించి, శిక్షించాలి.

దివ్యాంగుడికి న్యాయం చేయాలి


ఎస్పీకి సమస్యను వివరిస్తున్న వీరుయాదవ్‌

యలమంచిలి నియోజకవర్గం అచ్యుతాపురానికి చెందిన దివ్యాంగుడు మేరుగు నూకరాజుపై దౌర్జన్యానికి పాల్పడిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమసంఘం వ్యవస్థాపకుడు పాత్రుపల్లి వీరుయాదవ్‌ స్పందనలో ఎస్పీకి అర్జీ సమర్పించారు. అచ్యుతాపురం పోలీసుల నిర్లక్ష్యంపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

భర్త కళ్లెదుటే భార్య దుర్మరణం


ప్రమాద స్థలిలో అపర్ణ మృతదేహం


దాసరి అపర్ణ (ఫైల్‌)


తీవ్ర గాయాలతో దాసరి సత్యం

అక్కిరెడ్డిపాలెం/అనకాపల్లి టౌన్‌: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న దంపతులను వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో భార్య తలకు తీవ్ర గాయాలవడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందగా భర్తకు తీవ్ర గాయాలయ్యాయి. గాజువాక ఎస్‌ఐ కొల్లి సతీష్‌ తెలిపిన వివరాల ప్రకారం... విజయనగరం జిల్లా కొత్తవలస గ్రామానికి చెందిన దాసరి సత్తిబాబు, భార్య అపర్ణ (26) ఉపాధి కోసం అనకాపల్లి ప్రాంతానికి ఐదు సంవత్సరాల క్రితం వలస వచ్చారు. పట్టణంలోని అంజయ్యకాలనీలో అద్దె ఇంటిలో నివసిస్తున్నారు. వీరికి భరత్‌ (6), షణ్ముఖ్‌ (4) సంతానం. పిల్లలు సమీపంలోని పాఠశాలలో చదువుతున్నారు. సత్తిబాబు పట్టణంలోని ఓ షాపింగ్‌ మాల్‌ క్యాషియర్‌గా పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో విశాఖ నగరంలోని దొండపర్తి వద్ద ఉన్న బంధువులను కలిసేందుకు సత్యం, అపర్ణ సోమవారం ఉదయం బయలుదేరారు. ఈ క్రమంలో వీరు ప్రయాణిస్తున్న స్కూటీ బీహెచ్‌పీవీ సిగ్నల్‌ పాయింట్‌ దాటి నాతయ్యపాలెం సమీపిస్తుండగా వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో స్కూటీ వెనుక కూర్చున్న అపర్ణ తూలి రోడ్డుపై పడగా ఆమె తలకు తీవ్ర గాయాలవడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందింది. భర్త సత్యంకు తీవ్ర గాయాలయ్యాయి. కళ్లెదుటే భార్య మృతి చెందడాన్ని చూసిన సత్యం రోదిస్తున్న తీరు పలువురిని కలిచివేసింది. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ పరారయ్యాడు. సమాచారం అందుకున్న గాజువాక ఇన్‌చార్జి సీఐ వి.శ్రీనివాసరావు, ఎస్‌ఐ కొల్లి సతీష్‌ సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. గాయాల పాలైన సత్యంను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్లు సీఐ తెలిపారు. ఈ దుర్ఘటనతో అనకాపల్లి అంజయ్యకాలనీలో విషాదం నెలకొంది.

కొత్తపేటలో శ్రీకాకుళం వాసి దారుణ హత్య

- కత్తితో గొంతు కోసి చంపేసిన వైనం
- సహచర కార్మికులపైనే అనుమానాలు


మాధవరావు(ఫైల్‌)

రాంబిల్లి: కొత్తపేటలో దారుణహత్య చోటుచేసుకుంది. శ్రీకాకుళానికి చెందిన లోపింటి మాధవరావు(23)ను పీక కోసి హత్య చేశారు. ఆదివారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు. నేవల్‌ బేస్‌లో నిర్మాణ పనులు చేస్తున్న ఎల్‌ అండ్‌ టీ సంస్థలో కాంట్రాక్టర్‌ నారాయణ వద్ద మాధవరావు గత కొన్నాళ్లుగా పనిచేస్తున్నాడు. అక్కడే పరిచయమైన మరో ఐదుగురు కార్మికులతో కలిసి కొత్తపేటలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని ఉంటున్నారు. మాధవరావు మరణానికి దారితీసిన పరిస్థితులు ఇంకా తెలియరాలేదు. కాంట్రాక్టర్‌ నారాయణ ఇచ్చిన సమాచారం మేరకు సోమవారం డీఎస్పీ సత్యనారాయణ పర్యవేక్షణలో సీఐ గఫూర్‌, ఎస్‌ఐ దీనబంధు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. డాగ్‌ స్క్వాడ్‌ను రంగంలోకి దించగా, ఒక కార్మికుడి వైపు వెళ్లినట్లు తెలిసింది. దీంతో అదే రూంలో ఉంటున్న ఐదుగురు కార్మికులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిని విచారణ చేస్తున్నట్టు ఎస్‌ఐ దీనబంధు తెలిపారు.

ఉలిక్కిపడ్డ కొత్తపేట

రక్తపు మడుగులో మాధవరావు మృతదేహం పడివుండటం, హత్య జరిగిన ప్రదేశంలో పొడవైన కత్తి దొరకడంతో కొత్తపేటలో భయానక వాతావరణం చోటు చేసుకుంది. మండల వ్యాప్తంగా ఈ వార్త దావానలంలా వ్యాపించింది. వారం రోజుల క్రితం కొత్తపేటలో ఒక కార్మికుడిని మరో కార్మికుడు చాకుతో కడుపులో పేగు బయటకు వచ్చేలా పొడిచిన విషయం తెలిసిందే. ఆ సంఘటన మరువకముందే ఇది చోటుచేసుకోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కుక్కల దాడిలో వ్యక్తి మృతి

మరొకరికి గాయాలు

మునగపాక: మండలంలోని తోటాడలో సోమవారం సాయంత్రం కుక్కల దాడిలో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళం ప్రాంతానికి చెందినట్లు స్థానికులు చెప్తున్న గుర్తుతెలియని వ్యక్తి గత కొంతకాలంగా మండలంలోని తోటాడ సమీపంలో కార్మికునిగా పని చేస్తున్నాడు. మద్యానికి బానిసైన అతను గత రెండు రోజులుగా మద్యం మత్తులో అపస్మారక స్థితిలోనే ఉన్నాడు. సోమవారం సాయంత్రం తోటాడ మద్యం షాపు సమీపంలో రోడ్డుపై పడిపోయాడు. అదే సమయంలో కుక్కలు గుంపుగా వచ్చి అతనిపై దాడి చేశాయి. దీంతో కిందపడిపోయిన అతని తల వెనుక భాగంలో బాగా దెబ్బలు తగిలాయి. కుక్కలు అతనిని కొంతమేర పీక్కుతినడంతో గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించి, అనకాపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఇదే గ్రామానికి చెందిన ఆళ్ల సూరప్పారావుపై కూడా కుక్కలు దాడి చేయడంతో గాయపడ్డాడు. గత కొంతకాలంగా గ్రామంలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నా పట్టించుకోకపోవడంతోనే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు.

వివాహిత అదృశ్యం

కశింకోట: మండలంలోని సుందరయ్యపేట శివారు లాలం కొత్తూరులో వివాహిత కనిపించడం లేదని వచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎ.ఆదినారాయణరెడ్డి తెలిపారు. లాలంకొత్తూరులోని తన ఇంటి నుంచి విశాఖలో ఉన్న అమ్మ వారి ఇంటికి వెళతానని బీరా నాగమణి (23) ఆదివారం బయలుదేరినట్లు చెప్పారు. అయితే ఆమె అమ్మ వారి ఇంటికి చేరకపోవడం, ఎక్కడా ఆచూకీ లేకపోవడంతో తల్లి బీరా దేవి, భర్త రావాడ సాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. నాగమణికి పిల్లలు లేరు. తాళ్లపాలెంలోని ప్రైవేటు క్లినిక్‌లో నర్సుగా పనిచేస్తున్నట్లు చెప్పారు.

ఏలేరు కాలువకు భారీ గండి

- సుమారు 100 ఎంజీడీల నీరు వృథా
- మరమ్మతు పనులకు అధికారుల చర్యలు


కాలువకు పడిన గండి

మాకవరపాలెం: ఏలేరు కాలువకు భారీ గండి పడింది. విశాఖ స్టీల్‌ప్లాంట్‌, నగర ప్రజల తాగునీటి అవసరాలకు నీటిని సరఫరా చేసే ఏలేరు కాలువకు మండలంలోని రాచపల్లి వద్ద సోమవారం తెల్లవారుజామున గండి పడింది. దీంతో 100.4 కిలోమీటరు వద్ద నున్న యూటీ (అండర్‌ టన్నెల్‌) ప్రాంతంలో 20 అడుగుల మేర గట్టు కోతకు గురైంది. ఈ నేపథ్యంలో కాలువ నుంచి నీరంతా పక్కనే ఉన్న గెడ్డ ద్వారా వృథాగా పోయింది. ఈ గండి కారణంగా ఎలాంటి నష్టం వాటిల్లలేదు. విషయం తెలుసుకున్న జీవీఎంసీ అధికారులు గండి ప్రాంతాన్ని పరిశీలించారు. గండి పూడ్చివేతకు సంబంధించిన పనులను ఈఈ చిరంజీవి, డీఈ కామేశ్వరరావు పర్యవేక్షించారు. సోమవారం రాత్రి 7 గంటల వరకు కాలువ నుంచి నీరు వృథాగా పోతూనే ఉంది. గండి పడటంతో సుమారు 100 ఎంజీడీల నీరు వృథా అయినట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. గండి పూడ్చివేతకు రూ.10 లక్షల వరకు ఖర్చవుతుందని తెలిపారు.

యుద్ధప్రాతిపదికన గండి పూడ్చివేతకు చర్యలు

ఏలేరు కాలువకు పడిన గండిని యుద్ధప్రాతిపదికన పూడ్చివేసేందుకు జీవీఎంసీ అధికారులు చర్యలు చేపట్టారు. పనులకు వీలుగా కొండల అగ్రహారం, అన్‌రాక్‌ పరిశ్రమ ప్రాంతంలో ఉన్న డైవర్షన్ల నుంచి నీటిని మళ్లించారు. కాలువలో నీటి తీవ్రత తగ్గిన అనంతరం పనులు చేపట్టేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. పొక్లెయిన్లతోపాటు గండి వద్ద వేసేందుకు ఇసుక, మెటల్‌ మూటను సిద్ధం చేశారు. ఈ గండి పూడ్చివేత పనులు మంగళవారం మధ్యాహ్నం వరకు కొనసాగే అవకాశం ఉంది. ఈఈ, డీఈ వెంట జీవీఎంసీ ఏఈ వెంకటరావు ఉన్నారు.

లాడ్జిలో హతురాలి వివరాలు లభ్యం

దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు


హతురాలు ఈశ్వరమ్మ

శృంగవరపుకోట: ఎస్‌.కోట పట్టణంలో ఆదివారం కలకలం రేపిన హత్యకేసులో పోలీసులు పురోగతి సాధించారు. చందన్‌ లాడ్జిలో వెలుగుచూసిన హత్యోదంతంలో హతురాలిని దేవరాపల్లికి చెందిన ఆరిపాక ఈశ్వరమ్మ(48)గా నిర్ధారించారు. కాగా ఈశ్వరమ్మ ఒంటిపైన ఉన్న బంగారం కోసమే హత్య చేసి ఉంటారన్న అనుమానాలు వినిపిస్తున్నాయి. ఆమె కొన్నేళ్లుగా ఎస్‌.కోటలోనే నివసిస్తోంది. అయితే ఈ హత్య కేసులో నిందితుడు ఎవరు? ఏ ఉద్దేశంతో హత్య చేశాడు? హత్య జరిగి ఎన్ని రోజులైంది? కేవలం బంగారం కోసమేనా? పాత కక్షలు ఏమైనా ఉన్నాయా? అన్న విషయాలు తెలియాల్సి ఉంది. ఈ కేసులో పోలీసులు ఇప్పటికే పూర్తిస్థాయి వివరాలు సేకరించినట్లు విశ్వసనీయ సమాచారం. మరిన్ని కచ్చితమైన సాక్ష్యాల సేకరణలో పోలీసులు నిమగ్నమయ్యారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను మంగళవారం వెల్లడించే అవకాశం ఉంది.

అదృశ్యమైన హాస్టల్‌ విద్యార్థి క్షేమం


భానుప్రసాద్‌ను తల్లి, హాస్టల్‌ సిబ్బంది సమక్షంలో అప్పగిస్తున్న సీఐ

చోడవరం రూరల్‌: హాస్టల్లో ఉంటూ బాగా చదువుకుంటాడని ఆశించిన తల్లిదండ్రులకు, పాఠశాల సిబ్బందికి కొన్ని గంటలపాటు ఆందోళన కలిగించారు. సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా బుచ్చెయ్యపేట మండలం లోపూడి గ్రామానికి చెందిన కాకర శంకర్‌, పార్వతమ్మల కుమారుడు కాకర భానుప్రసాద్‌ను పది రోజుల క్రితం సబ్బవరంలోని డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో చేర్పించారు. చిన్న వయసు కావడం, ఒక్కసారిగా తల్లిదండ్రులకు దూరంగా ఉండటం వల్లనో, మరో ఆలోచనో తెలియదుగానీ సోమవారం ఉదయం 7.30 గంటల సమయంలో అల్పాహారం తీసుకున్నా, హాస్టల్‌ సిబ్బంది కళ్లుగప్పి భానుప్రసాద్‌ బయటికి వచ్చేశాడు. సబ్బవరం ఆర్టీసీ బస్టాండ్‌లో చోడవరం వెళ్లే బస్సు ఎక్కాడు. చిన్న పిల్లాడు, ఒంటరిగా బస్సెక్కి బిత్తర చూపులు చూస్తుంటే అదే బస్సులో ప్రయాణిస్తున్న చోడవరం మండల గౌరీపట్నం వీఆర్వో పట్నాయక్‌ గమనించాడు. ఆ విద్యార్థిని చేరదీసి అసలు విషయం రాబట్టాడు. చోడవరంలో దిగాక విద్యార్థిని స్థానిక పోలీసు స్టేషన్లో అప్పగించాడు. సర్కిల్‌ ఇన్‌స్పెక్టర్‌ బి.శ్రీనివాసరావు విద్యార్థి వివరాలు తెలుసుకుని, లోపూడి నుంచి తల్లి పార్వతమ్మను, సబ్బవరం గురుకుల పాఠశాల హాస్టల్‌ సిబ్బందిని పిలిపించి, విద్యార్థిని వారికి అప్పగించారు. కొద్ది రోజులపాటు తమ వద్ద ఉంచి, తర్వాత పాఠశాలకు పంపాల్సిందిగా తల్లికి సీఐ సూచించారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం తగదని, అప్రమత్తంగా ఉండాలని హాస్టల్‌ సిబ్బందిని మందలించారు.

ఆర్టీసీ డ్రైవర్లపై దాడి

అనకాపల్లి టౌన్‌: ఇద్దరు ఆర్టీసీ డ్రైవర్లపై దాడి చేసిన ఐదుగురిపై కేసు నమోదు చేశారు. గ్రామీణ ఎస్‌ఐ నరసింగరావు అందించిన వివరాలు.. ఆర్టీసీ కార్గో బస్సులో సరకును వేసుకొని డ్రైవర్‌ ఎస్‌.బాలాజీ మరో డ్రైవర్‌తో కలిసి విశాఖ వెళ్తుండగా మార్గం మధ్యలో ఒక కారు బస్సును ఢీకొంది. కొప్పాక పైడితల్లమ్మ ఆలయం వద్ద బస్సుకు అడ్డంగా కారు నిలిపివేసి ఐదుగురు వ్యక్తులు వారిపై దౌర్జన్యం చేశారు. రూ.5,500 నగదు, వీవో వై 21 ఫోన్‌ తస్కరించినట్లు బాధితుడు బాలాజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.

బాల్య వివాహాలకు శిక్ష తప్పదు

జిల్లా సీనియర్‌ సివిల్‌ జడ్జి వెంకటశేషమ్మ


న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్‌ సివిల్‌ జడ్జి వెంకటశేషమ్మ

మాడుగుల: బాల్య వివాహాలను పోత్సహించినా, బాల్యవివాహాలకు పాల్పడినా, చట్టరీత్యా శిక్షలు తప్పవని జిల్లా సీనియర్‌ సివిల్‌ జడ్జి ఎం.వెంకటశేషమ్మ హెచ్చరించారు. మండలంలోని శంకరం పంచాయతీ క్రిష్ణంపాలెం గిరిజన గ్రామంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో పాల్గొని మాట్లాడారు. ఏ ప్రాంతంలో అయినా, ఎలాంటి ఆచారాలున్నా చట్టాలు అమలు కావాలన్నారు. మారుమూల గిరిజన ప్రాంతాల ప్రజలు చిన్నచిన్న సమస్యలతో కోర్టు చుట్టూ తిరుగుతున్నారన్నారని, అలాంటి వారికి అవసరమైతే ఉచిత న్యాయవాదిని నియమిస్తామన్నారు. అనంతరం చట్టాలపై అవగాహన కల్పించారు. చిన్న కేసుల్ని రాజీ కుదుర్చుకోవాలన్నారు. బహుభార్యత్వం అనేక ప్రాంతాల్లో ఉన్నప్పటికీ, మొదటి భార్యకు విడాకులు ఇచ్చాకే రెండో పెళ్లి చేసుకోవాలన్నారు. లేకుండా శిక్షకు గురికాక తప్పదన్నారు. తల్లిదండ్రులను సంరక్షించే బాధ్యత లేని పిల్లలు వారి ఆస్తిలో హక్కు కోల్పోతారన్నారు. లోక్‌ అదాలత్‌ ద్వారా పరిష్కారమయ్యే కేసులు, ప్రాంసరీ నోట్లలో తీసుకోవాల్సిన జాగ్రతలు, తదితర విషయాలను స్థానిక న్యాయవాదులు శ్రీనాదు ప్రసాదరావు, సీతా వెంకటరావు, గెంజి కృష్ణమూర్తి నాయుడులు గిరిజనులకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ సొలం రమేష్‌, ఎస్‌ఐ దామోదర నాయుడు, ఎక్సైజ్‌ సీఐ ఎస్‌. సింహాద్రి, కోర్టు సిబ్బందితో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజల మనిషికి సేవలతో శుభాకాంక్షలు


కేరళలో కుటుంబసభ్యుల మధ్య పుట్టిన రోజు వేడుకలు జరుపుకొంటున్న ఎమ్మెల్యే ధర్మశ్రీ


మేజర్‌ పంచాయితీ వడ్డాదిలో మొక్కలు నాటుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చోడవరం: సామాజిక కార్యక్రమాలతో ప్రభుత్వ విప్‌, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ పుట్టిన రోజు వేడుకలు సోమవారం వాడవాడలా ఎంతో సందడిగా జరిగాయి. నియోజకవర్గమంతా ఆయన పుట్టిన రోజు వేడుకలతో కార్యకర్తలు పలు కార్యక్రమాలు నిర్వహించారు. చోడవరం మండలంలో భారీ ఏర్పాట్ల మధ్య నిర్వహించిన వేడుకల్లో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్‌ పాల్గొన్నారు. కేక్‌ కట్‌చేసి అందరికీ స్వీట్లు పంచారు. ప్రజల మనిషిగా జనం హృదయాల్లో ఎమ్మెల్యే ధర్మశ్రీ సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారని అన్నారు. అంతకు ముందు చోడవరం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీచేశారు. ఈ వేడుకల్లో డీసీఎంఎస్‌ చైర్మన్‌ పల్లా నర్సింగరావు, పార్టీ జిల్లా ప్రతినిధి పప్పల జయదేవ్‌, ఎంపీపీ గాడి కాసు, మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ ఏడువాక సత్యారావు, మండల అధ్యక్షుడు దొడ్డి వెంకట్రావు, సర్పంచ్‌లు బండి నూకాలమ్మ శ్రీను, మూడెడ్ల శంకరావు, పోతల జానకీప్రసాద్‌, కొరకూటి భోగేష్‌, ఉగ్గిన నాగబాబు, శిరుచోళ్ల గణపతినాయుడు, శానాపతి రాజశేఖర్‌, బలిరెడ్డి నాగేశ్వరరావు, బూరే మాణిక్యం, శీరంరెడ్డి వెంకటరమణ, దంతులూరి శ్రీనివాసరాజు, బీసీ సెల్‌ అధ్యక్షుడు మొల్లి సోమునాయుడు, మండల వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ ఓరుగంటి నెహ్రూ, మాజీ జెడ్పీటీసీ బొడ్డేడ సూర్యనారాయణ పాల్గొన్నారు. కేరళలోని తిరువనంతపురంలో ఎమ్మెల్యే ధర్మశ్రీ ఉండటంతో అక్కడ అతని కుటుంబ సభ్యుల మధ్య కేక్‌ కట్‌ చేసి పుట్టిన రోజు వేడుకలు చేసుకున్నారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు విద్యార్థుల ఎంపిక


యోగా పోటీలకు ఎంపికైన విద్యార్థులు

పాయకరావుపేట: విశాఖ యోగా స్పోర్ట్స్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో సీతమ్మధార కృష్ణా మందిర్‌లో ఆదివారం నిర్వహించిన విశాఖ జిల్లా యోగా ఛాంపియన్‌షిప్‌–2023 పోటీల్లో శ్రీ ప్రకాష్‌ విద్యార్థులు 8 మంది ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు విద్యా సంస్థల సీనియర్‌ ప్రిన్సిపాల్‌ ఎంవీవీఎస్‌ మూర్తి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో వీరు సెప్టెంబర్‌ 10న కర్నూలులో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్‌ ప్రకాష్‌, వైస్‌ ప్రిన్సిపాల్‌ అపర్ణ, అకడమిక్‌ ఇన్‌చార్జ్‌లు కె.లక్ష్మి నీలాదేవి, సంధ్యారాణి, యోగా గురువు సురేష్‌ తదితరులు అభినందించారు.

క్లుప్తంగా

సమస్యలు కలెక్టర్ దృష్టికి తీసుకెళతాం



సభలో మాట్లాడుతున్న రేబాక మధుబాబు

అనకాపల్లిటౌన్: మండలంలో శంకరం గ్రామంలో మానవహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం గ్రామసభలో జరిగింది. జిల్లా విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యుడు రేబాక మధుబాబు గ్రామస్తుల సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఎంపీడీవో నర్సింహారావు త్వరలో సమస్యల పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గంగాధరరావు, గ్రామీణ ఎస్ఐ నరసింగరావు, సర్పంచ్ పసుపులేటి లక్ష్మి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తగ్గనంటున్న టమాటా



తాళ్లపాలెం సంతలో కూరగాయల అమ్మకాలు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం వారపు సంతలో సోమవారం టమాటా ధర తారాస్థాయికి చేరింది. కిలో రూ.200కు అమ్మకాలు సాగాయి. గత వారం కిలో రూ.150 ఉండగా ఈ వారం ఏకంగా రూ.50 పెరిగింది. క్రేట్ టమాటా రూ.3600కు విక్రయించారు. ఉత్పత్తి తక్కువగా ఉండడంతో ధర పెరిగిందని వ్యాపారులు తెలిపారు. పచ్చి మిరప ధర తగ్గింది. కిలో రూ.120 నుంచి రూ.80కి తగ్గింది. ఎప్పటిలాగే ఉల్లిపాయ రూ.25, బంగాళాదుంప రూ.30, వంకాయ, దొండకాయ, బెండకాయ రూ.40, క్యారెట్, బీట్రూట్ రూ.50, బీరకాయ, కాకరకాయ రూ.60, క్యాప్సికం రూ.వంద, అల్లం రూ.240కి విక్రయాలు సాగాయి.

నేడు విద్యుత్‌కు అంతరాయం

అనకాపల్లిటౌన్: పట్టణంలో పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు విద్యుత్‌శాఖ ఈఈ రాజశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూడిమడక రహదారి, ఆర్టీసీ కాంప్లెక్స్ ఏరియా, విజయా మెడికల్ వంటి ప్రాంతాల్లో జంగిల్ క్లియరెన్స్‌లో భాగంగా విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్టు ఆయన తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

అనకాపల్లి సినిమాలు

బేబి	:	రాజా
బ్రో	:	సత్యనారాయణ స్క్రీన్-1
మహావీరుడు	:	సత్యనారాయణ స్క్రీన్-2
బ్రో	:	షిర్డిసాయి
పిఫర్ ఇంపాజిబుల్(తెలుగు)	:	పర్తిసాయి
బ్రో	:	వెంకటేశ్వర
అన్నపూర్ణ ఫొటో స్టూడియో	:	శ్రీసత్య
బ్రో	:	రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు సోమవారం 173 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	-	-
రెండో రకం	3,870	4,110
మూడోరకం	3,850	3,930

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 33 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-7 యూనిట్లు, ఏ నెగిటివ్-2 యూనిట్లు, బీ పాజిటివ్-15 యూనిట్లు, ఓ పాజిటివ్-3 యూనిట్లు, ఓ నెగిటివ్-2 యూనిట్లు, ఏబీ పాజిటివ్-4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 429 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 385 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

మట్టి గణపతి కోసం గట్టి సంకల్పం

పర్యావరణ పరిరక్షణకు సహజ వనరులతో విగ్రహాలు



వివిధ రూపాల్లో వినాయక విగ్రహాలు



కశింకోటలో తయారు చేస్తున్న మట్టి గణపతి ప్రతిమలు



వినాయక విగ్రహానికి మెరుగులు

కశింకోట: ఆది పూజలందుకునే గణనాథుని మట్టి విగ్రహాలు రూపుదిద్దుకుంటున్నాయి. పర్యావరణ పరిరక్షణకు అనువుగా వినూత్న రీతిలో చిన్న సైజు నుంచి పెద్ద ప్రతిమల వరకు విగ్రహాల తయారీ చేపట్టారు. కశింకోటలోని కస్పావీధి ప్రాంతంలో కుమ్మరి వీధిలో వీటిని తయారు చేస్తున్నారు. ఏటా భాద్రపద మాసం శుక్ల పక్షం చవితి రోజు నుంచి వినాయక నవ రాత్రి ఉత్సవాలు జరుగుతాయి. ఈ సందర్భంగా ఇళ్లలోను, గ్రామాలు, వీధుల్లోని చలువ పందిళ్లలో విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు, పెద్ద ఎత్తున ఉత్సవాలు నిర్వహించనున్న సంగతి తెలిసిందే. గతంలో ప్లాస్టర్ ఆఫ్ పారిస్ ఉపయోగించి గణనాథుని విగ్రహాలను తయారు చేసేవారు. ఇవి నిమజ్జనం చేశాక నీటిలో కరగకపోవడంతో పర్యావరణానికి హాని కలిగిస్తున్నాయి. దీంతో మట్టితో తయారు చేసిన వినాయక ప్రతిమలు, విగ్రహాలను పూజించి పర్యావరణ పరిరక్షణకు దోహదపడేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఈ నేపథ్యంలో మట్టి విగ్రహాల తయారీని శిల్పి దేవరపు సతీష్ ఆధ్వర్యంలో నిర్వాహకులు చేపట్టారు. స్థానిక కుమ్మరి వీధికి చెందిన సతీష్‌కు వినాయకుని విగ్రహాల తయారీలో ప్రావీణ్యం ఉంది. తన తండ్రి, గురువుల నుంచి నేర్చుకున్న విద్యకు పదును పట్టి వినూత్నంగా విగ్రహాలను రూపొందిస్తూ ఉత్సవ నిర్వాహకుల ఆదరాభిమానాలు పొందుతున్నారు. బయ్యవరం వద్ద చెరువు నుంచి నాణ్యమైన మట్టిని తెచ్చి సహాయకులతో కలిసి విగ్రహాలను రూపొందిస్తున్నారు. చిన్న విగ్రహాలు మొదలుకొని సుమారు 8 అడుగుల పొడవు ఉన్న విగ్రహాల వరకు మట్టితో తయారు చేస్తున్నారు. శివుని ఆకారంలో వినాయకుడు, సిద్ధి వినాయకుడు, శయన వినాయకుడు తదితర రూపాల్లో ప్రతిమలు, విగ్రహాలను రూపొందిస్తున్నారు. మట్టితో తయారు చేసిన విగ్రహాలకు పర్యావరణానికి హాని లేని రంగులను వినియోగించి అందంగా మలచనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వీటి కోసం స్థానికులతోపాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చి ఇప్పటికే ఆర్డర్ ఇచ్చి విగ్రహాలు తయారు చేయించుకుంటున్నారు. వీటి తయారీలో నిర్వాహకులు నిమగ్నమై బిజీగా ఉన్నారు.

పర్యావరణ హితంగా..



పర్యావరణానికి హాని కలగని విధంగా మట్టితో వినాయకుని విగ్రహాల తయారీ చేపట్టాం. తండ్రి బాబూరావు వద్ద, అనకాపల్లిలో గురువు వద్ద నేర్చుకొని సుమారు 15 ఏళ్లుగా వీటిని తయారు చేస్తున్నాను. వినాయక చతుర్థికి రెండు నెలల ముందు నుంచి తయారీ ప్రారంభిస్తాం. విగ్రహాలకు ఆదరణ ఉన్నా పెట్టుబడి అధికం కావడం వల్ల మాకు రోజు కూలీ తప్ప ఆదాయం అంతంత మాత్రమే. ఉత్సవ రోజుల్లో విగ్రహాలు తయారు చేస్తాం. మిగిలిన రోజుల్లో బెంగళూరు ప్రాంతానికి కుటుంబంతో వలస వెళ్లి ఇటుకల బట్టీలో పనిచేస్తుంటాం. రోజూ వెయ్యి ఇటుకలు తయారు చేస్తే ఇటుకకు రూపాయి వంతున కూలీ వస్తుంది. దానితో కుటుంబాన్ని నెట్టుకు రావలసి వస్తోంది.

– దేవరపు సతీష్, శిల్పి, కశింకోట

క్రీడలపై ఆసక్తి పెంచుకోండి



జిల్లా స్థాయి బాడీ బిల్డింగ్ పోటీల్లో వివిధ విభాగాల్లో గెలుపొందిన బాడీ బిల్డర్స్‌తో డీఎస్పీ సుబ్బరాజు

అనకాపల్లిటౌన్ : క్రీడాకోటాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు పొందవచ్చని, విద్యార్థి దశ నుంచి క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని డీఎస్పీ వి.సుబ్బరాజు అన్నారు. స్థానిక జార్జి క్లబ్ ఆవరణలో జిల్లా బాడీ బిల్డర్స్ అసోసియేషన్, అబ్దుల్ కలాం సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలు ఆదివారం రాత్రి ముగిసాయి. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు ఓటములు సమానంగా తీసుకోవాలన్నారు. నిత్యం వ్యాయామం, క్రీడలతో ప్రతి వ్యక్తి ఆరోగ్యంగా జీవించవచ్చని చెప్పారు. ఈ పోటీల్లో 96మంది బాడీ బిల్డర్స్ పాల్గొన్నారు. జిల్లా స్థాయి బాడీబిల్డింగ్ చాంపియన్ షిప్(ఓవర్‌ఆల్) పట్టణంలో జగన్ జిమ్‌కు చెందిన పెద్దాడ ప్రసాద్ దక్కించుకోగా, 55 కేజీల విభాగంలో పాయకరావుపేటకు చెందిన జై.కల్యాణ్‌కు ప్రథమస్థానం, 65 కేజీల విభాగంలో పరవాడకు చెందిన జీఈపి.పృధ్వీకి ప్రథమస్థానం, 70 కేజీల విభాగంలో పరవాడకు చెందిన జి.కిరణ్‌కు ప్రథమస్థానం, 75 కేజీల విభాగంలో చోడవరంకు చెందిన నవీన్‌కుకు ప్రథమస్థానం, 75 కేజీల పైబడిన విభాగంలో అనకాపల్లికి చెందిన కె.రేవంత్‌నాయుడుకు ప్రథమస్థానాలు సాధించారు. వారికి డీఎస్పీ సుబ్బరాజు చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా బాడీ బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేలం చంద్రశేఖర్, కార్యదర్శి కోరిబిల్లి సోమునాయుడు, అబ్దుల్ కలాం సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఆళ్ల ప్రవీణ్‌కుమర్, జార్జిక్లబ్ అధ్యక్షుడు బుద్ద కాశీ, క్రీడాకారులు పాల్గొన్నారు.

నిల్వ నీటితో డెంగ్యూ జ్వరాల ముప్పు



కశింకోట పీహెచ్‌సీ వైద్య, ఆరోగ్య సిబ్బంది డెంగ్యూపై అవగాహన ర్యాలీ

కశింకోట : కశింకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య, ఆరోగ్య సిబ్బంది సోమవారం డెంగ్యూ జ్వరాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డెంగ్యూ మాసోత్సవాలు పురస్కరించుకొని పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎస్.తిరుపతిరావు, వై.యశోద ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు. దోమల వల్ల డెంగ్యూ వ్యాప్తి చెందుతుందన్నారు. నీరు నిల్వ ఉన్న చోట దోమలు గుడ్లు పెట్టి అభివృద్ధి చెందుతాయన్నారు. అందువల్ల తప్పనిసరిగా వారానికి ఒక శుక్రవారం రోజు డ్రై డే పాటించాలన్నారు. ఇళ్లల్లో, ఇంటి పరిసరాల్లో, రుబ్బురోలు వంటి చోట్ల నిల్వ నీటిని ప్రతి వారం ఖాళీ చేయాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమ తెరలు వాడాలని, ఇళ్లలో పొగపెట్టి దోమలను పారద్రోలాలన్నారు. జ్వరం వస్తే రక్త పరీక్షలు జరిపించుకొని చికిత్స పొందాలన్నారు. ఈ సందర్భంగా ప్రతి వారం డ్రై డే పాటిస్తామని అంతా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ సత్యవతి, ఎంపీహెచ్ఈవో సత్యనారాయణ, సూపర్‌వైజర్లు ప్రకాష్, విజయలక్ష్మి, హెల్త్ అసిసెంట్లు సుభాని, గుప్తా, రామకృష్ణ, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఏలేరు కాల్వలో తగ్గిన నీటిమట్టం



తాళ్లపాలెం సంత వద్ద ఏలేరు కాలువ



మీటరు గేజు దిగువకు కాలువ నీటి ప్రవాహం

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం సంత వద్ద సోమవారం విశాఖ స్టీల్ ప్లాంట్‌కు నీరు సరఫరా చేసే ఏలేరు కాలువలో నీటి మట్టం సగానికి తగ్గిపోయింది. మాకవరపాలెం వద్ద ఏలేరు కాలువకు గండి పడడంతో నీరు వృధాగా పోవడం వల్ల కాలువలో నీటి సరఫరా తగ్గిపోయింది. సాధారణంగా మీటరున్నర మట్టానికి నీరు ప్రవహిస్తుండేది. ఇప్పుడు ఎగువ ప్రాంతంలో పడిన గండి వల్ల అది దాదాపు సగానికి తగ్గిపోయింది. దీంతో సంతకు వచ్చి కాలువను పరిశీలించిన ప్రజలు విస్తుపోయారు.

మహిళలు, చిన్నారులపై వేధింపులు అరికట్టాలి

అచ్యుతాపురం చేరుకున్న మహిళల పోరుయాత్ర



అచ్యుతాపురం మండలంలో జరిగిన సభలో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి

అచ్యుతాపురం(అనకాపల్లి): ఐద్వా ఆధ్వర్యంలో మహిళల పోరు యాత్ర సోమవారం అచ్యుతాపురం చేరుకుంది. అచ్యుతాపురం ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాల వద్ద జరిగిన సభలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి మాట్లాడుతూ మహిళలు, చిన్నారులపై జరుగున్న హింసను అరికట్టేందుకు నిపుణులతో కూడిన కమిటీ వేయాలని సూచించారు.నిందితులను శిక్షించేందుకు ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని కోరారు. హింస, అశ్లీలతను ప్రేరేపించే చలన చిత్రాలు, సీరియల్స్, ఇంటర్నెట్ కార్యక్రమాలు నిషేధించాలని కోరారు. డీఎడిక్షన్ సెంటర్‌లను ఏర్పాటు చేయాలని కోరారు. జూలై 28న ప్రారంభమైన జాతా ఆగస్టు 8న విజయవాడలో నిర్వహించే బహిరంగ సదస్సుతో ముగుస్తుందని తెలిపారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు మాణిక్యం, విశాఖ జిల్లా కార్యదర్శి సత్యవతి,రాష్ట్ర సహాయ కార్యదర్శి రమణి,ఉపాధ్యక్షురాలు పూర్ణ, సీఐటీయూ నాయకులు ఆర్.రాము, కె.సోమునాయుడు, ఆర్.లక్ష్మి పాల్గొన్నారు.

మత్తు పదార్థాలను నియంత్రించాలి

మునగపాక : హింస, మద్యం, మత్తు పదార్థాలను నియంత్రించాలని కోరుతూ అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో సోమవారం మునగపాక మెయిన్‌రోడ్డులో ఆందోళన నిర్వహించారు. ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు పద్మ మాట్లాడుతూ దేశంలో మహిళలపై అత్యాచారాలు, హత్యలు పెరిగిపోతున్నాయన్నారు. ఇందుకు కారణం మత్తు పదార్థాలేనన్నారు. వీటిని అరికట్టడానికి ప్రభుత్వాలు తీసుకోవాల్సిన చర్యలపై గ్రామ గ్రామాన రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర నాయకులు సత్యవతి, జిల్లా కార్యదర్శి మాణిక్యం, సీఐటీయూ జిల్లా కోశాధికారి వీవీ శ్రీనివాసరావు, మండల నాయకులు ఎస్.బ్రహ్మాజీ, రైతు సంఘ నాయకుడు కర్రి అప్పారావు పాల్గొన్నారు.

హైస్కూళ్ల విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ



కశింకోట బాలికల హైస్కూలులో విద్యార్థినులకు సైకిళ్ల అప్పగింత

కశింకోట: కశింకోటలోని డీపీఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బాలికల హైస్కూళ్లలో చదువుతున్న 9,10 తరగతుల విద్యార్థినులకు సోమవారం సైకిళ్లను అప్పగించారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చొరవతో అరబిందో ఫార్మసిటీ పరిశ్రమ సహకారంతో 140 మందికి సైకిళ్లను అనకాపల్లిలో పంపిణీ చేశారు. వీటిని ఇక్కడ బాలికల హైస్కూలులో బాలికలకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, సర్పంచ్ మంత్రి జయరజని, హెచ్ఎం ఎం.ఎస్.స్వర్ణకుమారి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మంత్రి పీటర్, స్కూలు కమిటీ అధ్యక్షుడు యల్లపు శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విఠల్‌బాబు హత్య దారుణం



మానవహారంగా ఏర్పడిన న్యాయవాదులు

అనకాపల్లిటౌన్ : న్యాయవాది ఆర్.ఆదిశేషు విఠల్‌బాబు హత్య పట్ల స్థానిక బార్ అసోసియేషన్ సభ్యులు సోమవారం స్థానిక న్యాయసముదాయం ముందు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.ఎస్.వి.లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రకాశం జిల్లా అద్దంకిలో కొందరు దుండగులు విఠల్‌బాబును హత్య చేయడం న్యాయవ్యవస్థకే తీరని మచ్చగా ఏర్పడిందన్నారు. అంతకుముందు న్యాయవాదులందరూ మానవహారంగా ఏర్పడి నిరసన తెలియజేశారు. ఈ న్యాయవాదులు కె.శ్రీనివాసరావు, మళ్ల జగపతి, వై.ఈశ్వరరావు, జి.రామచంద్రరావు, ఎంవి.రెడ్డి, డి.సత్యనారాయణ, ఎం.గోవింద, మోహన్‌బాబు, అవినాష్, ఆర్.రామారావు, కరణం సత్తిబాబు, ఎస్.నూకరాజు, పి.లీల పాల్గొన్నారు.

టెన్త్ టాపర్‌కు ఘన సత్కారం

పాయకరావుపేట : టెన్త్ పరీక్ష ఫలితాల్లో 600 గాను 594 మార్కులు సాధించి అనకాపల్లి జిల్లా టాపర్‌గా నిలిచిన కాట్నం సత్య అనంతలక్ష్మి సుప్రజను గౌతమ్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జి.అశోక్ సోమవారం సన్మానించారు. ముఖ్య అతిథులు ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయ మాజీ వీసీ ముర్రు ముత్యాలనాయుడు చేతుల మీదుగా గౌతమ్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అశోక్ సుప్రజను అభినందిస్తూ ప్రోత్సాహకంగా ట్యాప్‌టాప్, జ్ఞాపికలను అందించారు. ముర్రుముత్యాల నాయు డు సుప్రజను అభినందించి, మరెన్నో విజయాలను అందుకోవాలని ఆశీర్వదించారు. విద్యార్థుల ను ఉద్దేశించి మాట్లాడుతూ ఆత్మ విశ్వాసం, పట్టుదల వుంటే అందరూ ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చునని తెలిపారు.

ధ్రువపత్రాల అవకతవకలపై విచారణ



విలేకరులతో మాట్లాడుతున్న డీఎల్‌డీవో మంజులా వాణి

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని దిబ్బపాలెం సచివాలయం పరిధిలో ధ్రువీకరణ పత్రాల సృష్టి, కార్యదర్శి సంతకం ఫోర్జరీ వంటి అంశాలపై నిగ్గు తేల్చేందుకు పంచాయితీ అధికారులు రంగంలోకి దిగారు. డీఎల్‌డీఓ మంజులా వాణి, డీపీవో శిరీషారాణిలు సచివాలయ సిబ్బందిని సోమవారం విచారణ చేశారు. రికార్డులను పరిశీలించి, ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న తీరుపై విచారణ జరిపారు. ఉద్దేశ్యపూర్వకంగా జరిగిందా, సాంకేతిక లోపాలా అనే అంశంపై నిగ్గు తేల్చి జిల్లా కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తామని వారు తెలిపారు. ఇంటి పన్ను వసూలు చేస్తున్నట్టు మహిళా పోలీసులపై కూడా వారు విచారణ జరిపారు. డిజిటల్ అసిస్టెంట్ సృష్టించిన నకిలీ పెళ్లి ధ్రువపత్రంతో పాటు, ఇతర అవకతవకలపై లోతుగా విచారణ జరుపుతున్నామని, అయితే ఇక్కడి సిబ్బంది వివరణ పొంతన లేదని వారు తెలిపారు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం



వృద్ధురాలు భోగాది మహాలక్ష్మి సమస్యను వింటున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్



మామిడిపాలెంలో కాలువను పరిశీలిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

- ప్రతి సమస్య పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి
- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో మంత్రి అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్: ఎన్నికల సమయంలో ప్రకటించిన మేనిఫెస్టోను 98 శాతం అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికే దక్కిందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి సీఎంగా జగన్‌ను గెలిపించి, మరింతగా రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమానికి సహకరించాల్సిందిగా అభ్యర్థించారు.

మండలంలోని మామిడిపాలెం గ్రామంలో సోమవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. స్థానికుల సమస్యలపై స్పందిస్తూ.. ప్రతి ఒక్కరి అవసరాలు, ఆశలను నెరవేర్చేందుకు పూర్తి స్థాయిలో కృషి చేస్తున్నట్టు తెలిపారు. సాంకేతిక కారణాలతో ప్రభుత్వ పథకాలు అందని లబ్ధిదారులు తక్షణమే సచివాలయాల్లో వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. కె.తారలమ్మ మంత్రితో మాట్లాడుతూ తనకు ఏడేళ్ల క్రితం గుండె ఆపరేషన్ జరిగిందని, అప్పటి నుంచి నరాల బలహీనత ప్రారంభమైందన్నారు. ఆపరేషన్‌కు రెండు లక్షలకు పైగా ఖర్చయిందని, అప్పటి నుంచి మందుల కోసం రూ.వేల రూపాయలు వెచ్చించాల్సి వస్తోందని వాపోయారు. మంత్రి స్పందిస్తూ ఆపరేషన్ ఖర్చు బిల్లులు తమ కార్యాలయానికి పంపిస్తే, సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సాయం చేస్తామన్నారు. భోగాది మహాలక్ష్మి(70) అనే వృద్ధురాలు తన భర్త అప్పలనాయుడు ఐదేళ్ల క్రితం మరణించారని, ఇప్పటి వరకు వృద్ధాప్య/వితంతు పింఛన్ రాలేదని మొరపెట్టుకున్నారు. అక్కడే అధికారులను పిలిచి, వచ్చే నెల నుంచి ఆమెకు పింఛన్ అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. గ్రామంలో డ్రైనేజీ, విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు సత్వరం చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

పేద, బడుగు, బలహీన వర్గాల వారికి అపన్నహస్తం అందించేందుకు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారని, అందుకే ఆయన జన హృదయాలను గెలుచుకున్నారని పేర్కొన్నారు. ప్రజలకు ఇంతగా మేలు చేస్తున్నారు కాబట్టే, ప్రజా ప్రతినిధులం ధైర్యంగా ప్రజల ముందుకు రాగలుగుతున్నామన్నారు. కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి, స్థానికులతో మాట్లాడారు. కుటుంబాల వారీగా గత నాలుగేళ్లలో పొందిన సంక్షేమ లబ్ధిని గణాంకాలతో సహా వివరించారు. స్థానిక సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, ఎంపీటీసీ బందం అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకులు సేనాపతి హరికృష్ణ, శ్రీను, ఒ.అప్పారావు, ప్రభుత్వశాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

సైకిళ్ల పంపిణీతో వెల్లి విరిసిన ఆనందం



విద్యార్థినికి సైకిల్ అందిస్తున్న గొర్లి సూరిబాబు



సైకిళ్లు అందుకున్న విద్యార్థినులతో జాజుల రమేష్

అనకాపల్లిటౌన్ : మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సంకల్పం విద్యార్థినుల్లో వెలుగులు నింపిందని ఎంపీపీ గొర్లి సూరిబాబు పేర్కొన్నారు. మండలంలో తారకరామాకాలనీ జెడ్పీ హైస్కూల్లో సోమవారం విద్యార్థినులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి పిలుపును అందుకున్న అరబిందో ఫార్మా సంస్థ జీఎం నిత్యానందరెడ్డి సహకారంతో సైకిళ్లు అందజేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినుల తల్లిదండ్రులు, సచివాలయ కన్వీనర్ ధనలక్ష్మి, స్కూల్ హెచ్ఎం, ఉపాధ్యాయులు, వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు. అరబిందో ఫార్మా సంస్థ ద్వారా 467 సైకిళ్ల పంపిణీతో 83వ వార్డు పరిధిలో ప్రభుత్వ హైస్కూళ్ల విద్యార్థినుల్లో ఆనందం వెల్లివిరిసిందని వార్డు ఇన్‌చార్జి, వైఎస్సార్‌సీపీ పట్టణ యువజన విభాగం జాజుల రమేష్ అన్నారు. స్థానిక జీవీఎంసీ వేల్పులవీధి బాలికోన్నత హైస్కూల్లో ఆయన సోమవారం విద్యార్థినులకు సైకిళ్లు అందజేశారు. బాలికోన్నత హైస్కూల్‌కు 425, పెద్ద హైస్కూల్‌కు 26, భీమునిగుమ్మం అంబేడ్కర్ హైస్కూల్‌కు 16 సైకిళ్లు మొత్తం 467 సైకిళ్లు విద్యార్థినులకు అందజేశారని చెప్పారు. కార్యక్రమంలో స్కూల్ ఇన్‌ఛార్జి హెచ్ఎం సంధ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉగ్గిన అప్పారావు, గొర్లి చిన్న, బొండా శంకరరావు, వేల్పుల గణేష్, కొంకి శ్రీరామ్మూర్తి, కారుకుండి కన్నబాబు, మేడిశెట్టి గణేష్ పాల్గొన్నారు.

మణిపూర్‌లో హింసపై ఐద్వా పోరుయాత్ర



కశింకోటలో ఐద్వా ఆధ్వర్యంలో విద్యార్థులు, మహిళల మానవహారం

కశింకోట: మణిపూర్‌లో మహిళలపై జరిగిన అత్యాచార సంఘటనపై సోమవారం కశింకోటలో ఐద్వా ఆధ్వర్యంలో పోరు యాత్ర జరిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా అధ్యక్షురాలు బి.ప్రభావతి, సహాయ కార్యదర్శి సిహెచ్. రమణి, ఉపాధ్యక్షురాలు పి. పూర్ణ మాట్లాడుతూ మహిళలు, చిన్నారులపై హింస,అత్యాచార సంఘటనలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీటిని నివారించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు చేపట్టాలన్నారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక హింస, అత్యాచార సంఘటనలు ఇంకా పెరిగిపోయాయని విమర్శించారు. మణిపూర్‌లో గత మే 3న జరిగిన హింసపై అక్కడ, కేంద్రంలోను అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వాలు చర్యలు చేపట్టకుండా మిన్నకుండిపోయాయన్నారు. ఇది శోచనీయమన్నారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు బి.పద్మ, జిల్లా అధ్యక్షురాలు పి.మణ్యం, జిల్లా నాయకురాలు డి.డి.వరలక్ష్మి, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు రమణ, సీఐటీయు జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, స్థానిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

తక్కువ ధరకు మొక్కలు అందిస్తాం



ఏపీఎం శివప్రసాద్

ఎస్.రాయవరం : స్వయం సహాయక సభ్యులు మొక్కలు పెంచుకోవాలంటే ఐకేపీ ద్వారా ధరలు తగ్గించి మరిన్ని మొక్కలు తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఏపీఎం తెలిపారు. సాక్షి దినపత్రికలో సోమవారం ప్రచురితమైన 'పచ్చగా జనం మెచ్చగా' అనే శీర్షికకు ఏంపీఎం స్పందించారు. జిల్లా అధికారుల ఆదేశాలు మేరకు కడియం నర్సరీ నుంచి అన్ని రకాల మొక్కలు తీసుకు వస్తున్నామన్నారు. ఆసక్తి గల వారు ఉండే గ్రామాల్లో వీఓఏలను సంప్రదించవచ్చన్నారు. కడియం నర్సరీలో వంద నుంచి 120 ఉండే మామిడి మొక్క మండలానికి చేరేసరికి రూ.55కే వస్తుందన్నారు. మండలానికి వచ్చేసరికి జీడి రూ.50, సీతాఫలం రూ.50, నిమ్మ రూ.35, సపోటా రూ.50, జామ రూ.40, కొబ్బరి రూ.70, బత్తాయి రూ.65, చింత రూ.65 ఉన్నాయన్నారు. ఇవేకాకుండా నేరేడు తదితర రకాలు మొక్కలు కూడా లభ్యమవుతున్నాయని, కావాల్సిన వారు సమాచారం ఇచ్చి ఎన్ని మొక్కలు కావాలో చెబితే తీసుకువస్తామన్నారు.